ట్రెక్కింగ్‌కు కేరాఫ్ భువనగిరి ఖిల్లా
● ప్రపంచ పర్వతారోహకులకు ఇక్కడి నుంచే ప్రాథమిక శిక్షణ
● ఇప్పటి వరకు ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన వారు 98 మంది
● ప్రపంచ ఎత్తైన పర్వతాలను అధిరోహించిన వారు మరో 800 మంది

7

అసౌకర్యాలతో వణుకు

- ప్రభుత్వ హాస్టళ్లలో వసతులు కరువు
- ఆరుబయటే స్నానాలు, నేలపైనే నిద్ర
- ఇన్‌చార్జి వార్డెన్ల నిర్లక్ష్యం, వాచ్‌మన్‌లే దిక్కు
- హాస్టళ్లలో వసతులపై ఆంధ్రజ్యోతి విజిట్



ఆంధ్రజ్యోతి విజిట్



తిరుమలగిరి బీసీ హాస్టల్‌లో మంచాలు లేక నేలమీద పడుకున్న విద్యార్థులు

ఆత్మకూర్(ఎస్) హాస్టల్‌లో తలుపులు లేని కిటికీలు

రోజురోజుకూ చలితీవ్రత పెరుగుతోంది. ప్రభుత్వ హాస్టళ్లలో విరిగిన తలుపులు, కిటికీలు, బండరాళ్ల గదుల మధ్య చలిలో వణుకుతూ విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు. జిల్లాలోని చాలా హాస్టళ్లు అసౌకర్యాల మధ్య అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, స్నానాల గదులు లేవు. ఉన్నవి కూడా అపరిశుభ్రంగా ఉంటున్నాయి. రెండేళ్లుగా దుప్పట్లు పంపిణీ చేయకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచే తెచ్చుకుంటున్నారు. ఇన్‌చార్జి వార్డున్లు ఉన్న చోట్ల వాచ్‌మన్‌లే దిక్కయ్యారు. కొన్నిచోట్ల మంచాలు ఉన్నా సరిపోను లేక ఒక్కో మంచానికి ఇద్దరేసి సర్దుకుంటున్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో వెలుగుచూసిన అంశాలపై ప్రత్యేక కథనం

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)

చాలా హాస్టళ్లు అరకొర సౌకర్యాల మధ్య అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దశాబ్దాలుగా అందులోనే కొనసాగుతున్నా సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదు. పెన్‌పహాడ్ మండలంలోని బీసీ బాలుర హాస్టల్ 30 ఏళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. విరిగిన కిటికీలు, కనీసం తలుపులేకపోవడంతో దోమలు కుట్టి విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. స్నానపు గదుల్లేక ఆరుబయట చలికి వణుకుతూ స్నానం చేస్తున్నారు. ఇక్కడ 68 మంది విద్యార్థులుండగా, ఇన్‌చార్జి వార్డెన్ కొనసాగుతుండటంతో వాచ్‌మన్ అన్నీ వ్యవహారాలు చూస్తున్నారు. ఆత్మకూర్(ఎస్) మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల హాస్టల్‌లో గదులకు కిటికీలు లేవు, వర్షాలు వస్తే తరగతి గదులు నీటితో నిండిపోతున్నాయి. మునగాలలోని హాస్టళ్లలో కిటికీలు సక్రమంగా లేకపోవటంతో దోమల బెడద, చలితో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. బాలిక వసతి గృహం పక్కన భగీరథ వాటర్ ట్యాంక్ ఉండటంతో ట్యాంక్ నిండి, ఆ నీరు అంతా హాస్టల్ ఆవరణలోకి వస్తోంది.



తుంగతుర్తి ఎస్టీ హాస్టల్‌లో బోరువాటర్‌తో స్నానం చేస్తున్న విద్యార్థులు

స్నానాలు గదుల్లేక..

ఆత్మకూర్(ఎస్) మండలంలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల హాస్టల్‌లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా అధ్వానంగా మరుగుదొడ్లు, స్నానాల గదులు ఉన్నాయి. 380 మంది విద్యార్థులకు కేవలం 30 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. చివ్వెంల మండలంలో చందుపట్ల ఎస్సీ హాస్టల్‌లో స్నానపు గదులు అధ్వానంగా ఉన్నాయి. పరిసరాలు చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో ఉన్నాయి. 300 మంది విద్యార్థులుంటే మరుగుదొడ్లు, స్నానాలు గదులు 30 వరకు మాత్రమే ఉన్నాయి. దీంతో అందరు ఉదయం 5 గంటలకు లేచి కాలకృత్యాలు, స్నానాలు, చేసేసరికి పాఠశాల ప్రారంభ సమయం 9 దాకా అవుతోంది. దీంతో స్టడీ అవర్ కష్టమవుతోంది. తుంగతుర్తి మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్ విద్యార్థులు బోరు వాటర్ కింద స్నానం చేస్తున్నారు. బీసీ హాస్టల్‌లో కట్టెలతో పొయ్యి మీద నీళ్లు కాచుకుని స్నానం చేస్తున్నారు. రూ.3.5 కోట్లతో

(మిగతా 8వ పేజీలో)

జిల్లాలో హాస్టళ్లు, విద్యార్థులు		
ఎస్సీ	38	3,500
ఎస్టీ	21	3,000
బీసీ	33	2,200

వీటికి తోడు గురుకులాలు 42, కేజీబీవీలు 18 ఉన్నాయి.



పురపాలికల్లో ఎల్ఆర్ఎస్‌కు గ్రీన్‌సిగ్నల్

- జిల్లాలోని ఐదు మునిసిపాలిటీల్లో కొనసాగుతున్న ప్రక్రియ
- గతంలో దరఖాస్తు చేసిన వారికి మాత్రమే అవకాశం

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్)కు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశాలు జారీచేసింది. దీంతో ప్లాట్ల యజమానులు డబ్బులు చెల్లించి ప్లాట్లను క్రమబద్ధీకరించుకుంటున్నారు. దీంతో ఎల్ఆర్ఎస్ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. గతంలో మూడుసార్లు దరఖాస్తులు చేసుకున్నా పూర్తిస్థాయిలో క్రమబద్ధీకరణ జరుగలేదు. వాటన్నింటినీ పరిష్కరించాలని ప్రభుత్వం సంకల్పించింది.

2017 నుంచి దరఖాస్తుల స్వీకరణ

బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమ లేఅవుట్లలో ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఎల్ఆర్ఎస్‌ను ప్రవేశపెట్టింది. లేఅవుట్ల అనుమతులు పొందేందుకు పెద్దఎత్తున ఖర్చు వస్తుందని కొన్నిచోట్ల అక్రమంగా లేఅవుట్లు చేసి ప్లాట్లను విక్రయించారు. అలాంటి వాటిలో కొనుగోలు చేసిన వారు ఇళ్ల నిర్మాణ సమయంలో అనుమతులకే లక్షలు వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది. అలాంటి ప్లాట్ల క్రమబద్ధీకరణకు 2017లో ఎల్ఆర్ఎస్‌ను ప్రవేశపెట్టి దరఖాస్తులను తీసుకుని, అర్హత మేరకు క్రమబద్ధీకరించారు. తిరిగి మళ్లీ 2019లో మరోసారి ఎల్ఆర్ఎస్ అవకాశం కల్పించారు. కాకపోతే 2019లో మాత్రం నూతనంగా ఏర్పడిన మునిసిపాలిటీలు, పాత మునిసిపాలిటీల్లో విలీనమైన గ్రామాల్లోని ప్లాట్లకు మాత్రమే అవకాశం ఇచ్చారు. అయితే 2020 జనవరి 28వ తేదీలోపు స్థలాలను క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దీంతో వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దరఖాస్తులకు రూ.1000 డీడీ చెల్లించి ఆన్‌లైన్ చేసినా, పరిష్కరించలేదు.

మునిసిపాలిటీల్లో విలీన గ్రామాల్లో

జిల్లాలో తిరుమలగిరి, నేరేడుచర్ల నూతన మునిసిపాలిటీలతో పాటు సూర్యాపేట, కోదాడ మునిసిపాలిటీల్లో విలీనమైన గ్రామాల్లో ఏర్పాటుచేసిన అక్రమ లేఅవుట్లలోని స్థలాలను క్రమబద్ధీకరణకు అవకాశం

(మిగతా 8వ పేజీలో)



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి

ఉద్యమ జ్ఞాపకాలను ఆవిష్కరించాలి

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ దీక్షకు సంబంధించి ఈనెల 29 దీక్షా దివస్ రోజున ఫొటో ప్రదర్శనతో పాటు తెలంగాణ ఉద్యమ జ్ఞాపకాలను ప్రదర్శించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేటలో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ చరిత్రలో మరువలేని రోజు నవంబరు 29వ తేదీ అని, ఉద్యమ సారధి కేసీఆర్ దీక్ష చేపట్టిన రోజు అని వివరించారు. తెలంగాణ వచ్చుడో కేసీఆర్ చచ్చుడో అన్న మాట కోట్లాదిమందిని కదిలించిందన్నారు. అటువంటి రోజును అంతా ఏకమై మననం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణను సాధించిన కేసీఆర్ రాష్ట్రంలో పదేళ్ల పాటు చేసిన పాలనను దేశంలో ఏరాష్ట్ర సీఎం చేయలేదన్నారు. వినూత్న పథకాలతో ప్రజలను కంటికిరెప్పలా కాపాడుకున్నారని కొనియాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో విలన్‌పాలన కొనసాగుతుందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో మళ్లీ వచ్చేది కేసీఆర్ పాలనేనని స్పష్టం చేశారు. ప్రజలందరి ఆశీర్వాదంతో కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయమన్నారు. ఈ విషయం తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు తెలుసన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణను సాధించిన మహనీయుడు కేసీఆర్ అని తెలిపారు. కడుపుకట్టుకుని రాష్ట్రాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేశామని, కాంగ్రెస్ నాయకుల మాటలతో కేసీఆర్ పాలనను కాపాడుకోలేకపోయమని అన్నారు. కేసీఆర్ పోరాటపటిమ, గొప్పతనాన్ని ఈతరం యువతకు తెలియజేప్పాలన్నారు. ఉద్యమ నేపథ్యం, తెలంగాణ సాధన గురించి యువతకు వివరంగా చెప్పాలన్నారు. దీక్షా దివస్‌లో బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ముందుగా రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గాదరి కిశోర్‌కుమార్, బొల్లం మల్లయ్యయాదవ్, రమావత్ రవీంద్రనాయక్, మాజీ జడ్పీ చైర్మన్లు బండ నరేందర్‌రెడ్డి, గుజ్జ దీపికాయుగంధర్‌రావు, పార్టీ రాష్ట్ర నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, చెరుకు సుధాకర్, వై.వెంకటేశ్వర్లు, గోపగాని వెంకటనారాయణ గౌడ్, పెరుమాళ్ల అన్నపూర్ణ, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌ఏ రజాక్, దావుల వీరప్రసాద్‌యాదవ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కోటి దీపోత్సవం



మట్టపల్లి ఆలయ ఆవరణలో కోటి దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

మఠంపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని మట్టపల్లి మహాక్షేత్రంలో భక్తులు కోటిదీపోత్సవాన్ని సోమవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ రాజగోపురం వద్ద మహిళలు ప్రమిదల్లో దీపాలను వెలిగించారు. శ్రీస్వామి సన్నిధిలో వివిధ క్రతువులు జరిగాయి. దివ్యమూర్తులను ప్రధాన ద్వారం వద్ద భక్తుల దర్శనార్థం ఉంచి అర్చనలు నిర్వహించారు. దీపకాంతుల్లో ఆలయ పరిసరాలు వెలిగిపోయాయి.

కృష్ణమ్మకు మంగళ హారతి

మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహుడి క్షేత్రంలో మంగళవారం రాత్రి కృష్ణానదికి వేదపండితులు, మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమార్చనలు, అభిషేకాలు, సారె, చీర సమర్పించి, దీపారాధనలు చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో మంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామి, అమ్మవార్లకు ఉదయం నిత్యపూజలతో పాటు కల్యాణోత్సవం వైభవం జరిగింది. అనంతరం గరుడోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్యాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు కలగొద్దు

- వీడియోకాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన మంత్రి ఉత్తమ్, హాజరైన కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగవద్దని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఢిల్లీ నుంచి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం, కలెక్టర్‌తో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించి రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి వెంటనే డబ్బులు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పథకాలపై రైతులకు వివరించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 314 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, లక్ష మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఇప్పటివరకు 10,121 మంది రైతులకు రూ.145కోట్లను వారి బ్యాంకు ఖాతాలో జమచేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పీ రాంబాబు, డీఆర్‌డీవో అప్పారావు, ఆర్డీవోలు శ్రీనివాసులు, సూర్యనారాయణ, డీఎస్‌వో రాజేశ్వర్, డీఏవో శ్రీధర్‌రెడ్డి, సీపీవో కిషన్, డీపీవో నారాయణరెడ్డి, డీటీడీవో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాల అమలుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాల అమలుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో ఆయన అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పీ రాంబాబు, వివిధ పార్టీల నాయకులు చకిలం రాజేశ్వర్‌రావు, సత్యనారాయణతో పాటు అధికారులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుతో అధిక లాభాలు

మద్దిరాల : రైతులు పామాయిల్ సాగు చేస్తే అధిక దిగుబడితో పాటు లాభాలు సాధించవచ్చని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు, రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పోలుమళ్ల గ్రామంలో నిర్వహించిన మన ఊరిలో మన జాతరలో గ్రామానికి చెందిన పాశం అశోక్‌రెడ్డి సాగు చేసిన పామాయిల్ మొక్కలకు కలెక్టర్ నీళ్లు పోసి మాట్లాడారు. మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందజేయాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ అమీన్‌సింగ్, మండల ప్రత్యేకాధికారి నాగయ్య, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, ఉద్యానవన అధికారి ప్రమీత, జడ్పీ సీఈవో అప్పారావు, ఎంపీవో ఇబ్రహీం, ఏపీవో గుండు వెంకన్న పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నూతన్‌కల్: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మండలకేంద్రంలోని శంభుని చెరువు వద్ద నిర్వహించిన అమృత్ సరోవర్ కార్యక్రమం, రాజ్యాంగ అమలు దినోత్సవం, ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లను శాలువాలతో సన్మానించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో ఏర్పాట్లపై రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, డీఆర్‌డీవో అప్పారావు, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ సుదాకర్‌రెడ్డి, డీపీవో నారాయణరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో సునీత పాల్గొన్నారు.

లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

కోదాడ రూరల్, నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటి వరకు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. ధాన్యం కొనుగోళ్లు మరో 15 రోజుల్లో పూర్తవుతాయన్నారు. మండలంలోని నల్లబండగూడెంలో చిమిర్యాల సహకార సంఘం పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు 315 సెంటర్లు ఏర్పాటు చేసి లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఇందులో 94వేల మెట్రిక్ టన్నుల దొడ్డురకం, 6వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సన్నరకాలు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ వాజిద్ అలీ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

దోరకుంటలో అదనపు కలెక్టర్ రాంబాబు పారిశుధ్య కార్మికులను సన్మానించారు. రాజ్యాంగం ఏర్పడి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంచందర్‌రావు, ఎంపీవో పాండురంగయ్య, కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

ప్రజలకు అందుబాటులో ఉండాలి



షీటీం ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, పక్కన అదనపు ఎస్పీలు

సూర్యాపేటక్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీసుల నెలవారీ సమీక్షా సమావేశంలో మాట్లాడారు. కేసులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన దర్యాప్తు చేయాలని, అప్పుడే నమోదైన కేసుల్లో నేరస్తులకు కోర్టుల్లో శిక్షలుపడతాయన్నారు. నేరాల నివారణకోసం కార్డన్ సెర్చ్‌లు, పెట్రోలింగ్, వాహనాల తనిఖీలు, అనుమానితులను విచారించడం, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ర్యాగింగ్ లాంటి చట్టవ్యతిరేక ఘటనలు జరగకుండా కళాశాలల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటుచేసి అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరగాళ్ల బారినపడకుండా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. మహిళల భద్రత విషయంలో షీటీమ్ సిబ్బంది బాగా పని చేస్తున్నారని అభినందించారు. ఈ సందర్భంగా షీటీమ్ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు మేక నాగేశ్వర్‌రావు, జనార్దన్‌రెడ్డి, డీఎస్పీలు జి.రవి, శ్రీనివాసరావు, మట్టయ్య, ఏఆర్ డీఎస్పీ నర్సింహాచారి, ఎస్‌బీఐ వీరరాఘవులు, సీఐలు గురుకుల రాజశేఖర్, శ్రీనునాయక్, రఘువీర్‌రెడ్డి, చరమందరాజు, రజితారెడ్డి, సురేందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రాము, లక్ష్మీనారాయణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ నుంచి వైద్యరంగంలోకి

● రెమ్యోలియన్ విద్యార్థి అవినాష్‌కు ఎంబీబీఎస్‌లో సీటు ● ఆయన స్వస్థలం గుర్రంపోడు మండలం నడికుడ

రక్షణ రంగంలో చదువుతున్న వారు వైద్యరంగంలోకి చాలా తక్కువ. అందులోనూ ప్రపంచ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిన రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కళాశాల(ఆర్ఐఎంసీ) విద్యార్థులు రావడం మరీ అరుదు. అలాంటి అరుదైన ఘనతకు నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం నడికూడ గ్రామానికి చెందిన చేవూరి అవినాష్ సాధించారు. రక్షణ రంగంలో ఏ-గ్రేడ్ ఉద్యోగంలో చేరే అవకాశం ఉన్నా వదులుకుని నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ వైద్యకళాశాలలో సీటు సాధించారు. అంతకుముందు రాష్ట్రం నుంచి 2017లో ఆర్ఐఎంసీకి ఎంపికైన ఏకైక విద్యార్థి కూడా ఆయనే.



(ఆంధ్రజ్యోతి-గుర్రంపోడు)

డీజీపీ కార్యాలయంలో సీపీఆర్‌వోగా పనిచేస్తున్న నడికూడ గ్రామానికి చెందిన సీహెచ్.శ్రీనివాసరావు పెద్దకుమారుడు చేపూరి అవినాష్ రెండో తరగతి వరకు నల్లగొండలోని నల్లగొండ పబ్లిక్ స్కూల్‌లో, 8వ తరగతి వరకు హైదరాబాద్‌లోని రమాదేవి పబ్లిక్ స్కూల్‌లో చదివారు. అనంతరం 13ఏళ్ల వయస్సులో 2017లో రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కళాశాలకు నిర్వహించిన పరీక్షల్లో విజయం సాధించి ఆ కళాశాలకు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాత పరీక్ష ద్వారా తర్వాత ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. ఈ రాత పరీక్షను సంవత్సరానికి రెండుసార్లు నిర్వహిస్తారు. ప్రతీ రాష్ట్రం నుంచి ఒక్కొక్క విద్యార్థిని మాత్రమే ఎంపిక చేస్తారు. ఆర్ఐఎంసీ కళాశాలలో ప్రవేశం కల్పిస్తారు. ఇక్కడ 8 నుంచి 12వ తరగతి వరకు విద్యాభ్యాసంతో పాటు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ విభాగాలను ఎంచుకునేందుకు వీలు కల్పిస్తారు. ఇక్కడ చదివిన విద్యార్థులను రెమ్యోలియన్స్‌గా పిలుస్తారు. కానీ అవినాష్ మాత్రం అక్కడి నుంచి బయటికి వచ్చి మెడిసిన్‌ను ఎంచుకుని నీట్ ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకు సాధించి ప్రభుత్వ కళాశాలలో సీటు సాధించారు. రెమ్యోలియన్ విద్యార్థి మెడిసిన్ సీటు సాధించడం చాలా అరుదు.

సాంప్రదాయాలకు భిన్నంగా

సాంప్రదాయ రీత్యా రక్షణ రంగంలో సాహసాలు చేసే ఆర్ఐఎంసీ విద్యార్థులు రక్షణశాఖతో పాటు వారికి నచ్చిన భిన్నమార్గాలను ఎంచుకుంటారు. ఉత్తమ భారతీయ పౌరుడిగా ఆర్ఐఎంసీ క్యాడెట్లను తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఈ మిలిటరీ కళాశాల శిక్షణ ఇస్తుంది. ఈ విధంగానే అవినాష్ వైద్యరంగాన్ని ఎంచుకుని ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రవేశించారు. ఆర్ఐఎంసీ విద్యను పూర్తి చేసిన తర్వాత 2024లో మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాలలో రెమ్యోలియన్‌గా ఎంబీబీఎస్ సీటు పొందారు.

ఆర్ఐఎంసీ నేపథ్యం

1922లో ప్రిన్స్ ఆఫ్ వేల్స్ ప్రారంభించిన ఈ కళాశాల, స్వాతంత్ర్యం అనంతరం రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీ(ఆర్ఐఎంసీ)గా పేరు మార్చారు. ఆర్ఐఎంసీ అనేక ప్రతిష్ఠాత్మక రక్షణ సిబ్బందిని అందించడంలో అగ్రస్థానంలో నిలిచింది. ప్రతి రాష్ట్రం నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేసి ఈ కళాశాలలో శిక్షణ ఇస్తుంది. ఈ కళాశాల నుంచి నలుగురు భారత సైన్యాధిపతులు, ఇద్దరు భారత వైమానిక దళాధిపతులు, ఇద్దరు పాకిస్తాన్ వైమానిక దళాధిపతులు, ఒక పాకిస్తాన్ ఆర్మీ చీఫ్, బంగ్లాదేశ్‌లో ఉన్నత స్థాయి రక్షణాధికారులు(స్వాతంత్ర్యానికి పూర్వం ఇక్కడ చదివిన వారు) ఈ కళాశాలలో చదివిన వారిలో ఉన్నారు.ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును పొందిన ఏకైక విద్యాసంస్థగా ఆర్ఐఎంసీకి గుర్తింపు ఉంది. ఈ కళాశాల దేశానికి అనేక ఆర్మీ అధికారులు,పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషన్ అవార్డు గ్రహితలను అందించింది. రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న ఐపీఎస్ అధికారి రాజీవ్ రతన్ కూడా ఈ కళాశాల విద్యార్థి.

విజయాలు

ఆర్ఐఎంసీలో అవినాశ్ చదువుతో పాటు ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో తర్ఫీదు పొందారు. 2017లో ఉత్తరాఖండ్ స్టేట్ ఛాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడల్ గెలవడం నుంచి, 2023లో తెలంగాణ చీఫ్ మినిస్టర్ కప్‌లో సిల్వర్ మెడల్ అందుకోవడం వరకు అవినాష్ అనేక పతకాలను గెలుచుకున్నారు. కాగా సైనిక విద్యాసంస్థల విద్యార్థుల అత్యున్నత ప్రమాణాలకు చిహ్నంగా ఇచ్చే మెరిట్ కార్డ్, హాఫ్-బ్లూ పురస్కారాలను 2019లో అందుకున్నారు.

జాతీయ స్థాయిలో ప్రాధాన్యం

అవినాష్ 2021 నార్త్‌జోన్ ఎయిర్ రైఫిల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో జూనియర్, యూత్ కేటగిరిల్లో నేషనల్ ఛాంపియన్‌షిప్‌కి అర్హత సాధించడమే కాకుండా 2022, 2023లో 65వ, 66వ నేషనల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ తరపున ప్రాతినిధ్యం వహించి నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాతో రినౌన్డ్ షాట్‌గా అర్హత సంపాదించారు.

వైద్యరంగంపై ఆసక్తితోనే చేరా



తండ్రి శ్రీనివాసరావుతో అవినాష్

డెహ్రాడూన్‌లోని ఆర్ఐఎంసీలో చేరిన తర్వాత రక్షణశాఖలో కొనసాగాలంటే ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ గెజిటెడ్ ఏ-గ్రూప్ ఉద్యోగంలో చేరేవాడిని. ఆ ఉద్యోగ అవకాశాన్ని వదులుకుని వైద్యరంగంపై ఉన్న ఆసక్తితో నీట్ పరీక్ష రాసి ప్రభుత్వ కళాశాలలో సీటు పొందాను. అది అదృష్టంగా భావిస్తున్నా. ఆర్ఐఎంసీలో చదివిన క్యాడెట్ ఎవరూ ఈ మధ్యకాలంలో ఎంబీబీఎస్‌లో చేరే అవకాశం రాలేదు. నాకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజాసేవకు పాటుపడతా.

చేపూరి అవినాష్, రెమ్యోలియన్

పాఠాలు.. పాటలు

లఘు చిత్రాలతో సామాజిక చైతన్యం కల్పిస్తున్న లింగారెడ్డి

రాష్ట్రంలో జరుపుకునే ప్రముఖ పండుగలు, ఉత్సవాలు, జానపద సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, విద్య అంశాలను ఇతివృత్తంగా తీసుకొని లఘు చిత్రాలు, పాటలు నిర్మించి అందరి ఆదరణ పొందుతున్నాడు పెసరు లింగారెడ్డి. వృత్తి రీత్యా ఉపాధ్యాయుడైనప్పటికీ ఆయన తీసే ప్రతీ లఘు చిత్రం లేదా పాట ఒక సామాజిక అంశాన్ని స్పృశిస్తూ, సందేశాత్మకం గా ఉంటుంది.

- (తుర్కపల్లి -ఆంధ్రజ్యోతి)



యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పెసరు లింగా రెడ్డి. యాదాద్రి భువనగిరి జిల్లా పాఠశాల విద్యా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారిగా, జిల్లా భవిత కేంద్రాల సమన్వయకర్తగా విధులు నిర్వహిస్తూ స్వయంగా రాసి పాడు తూ నటిస్తుంటాడు. ఆ వీడియో లు, షార్ట్స్, సందేశాలను ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగ్రామ్‌ల్లో పెడుతూ అందరి మన్నన లు పొందుతున్నారు. తొలుత విలేజ్ సినిమా బ్యానర్‌పై పల్లె పంచాయతీ, తాగుబోతు శ్రీను, ప్రేమ-పెళ్లి, చిన్నారి పెళ్లి కూతురు, బాల్య స్నేహితులు, ఏటీఎం మోసాలు, సర్కారు బడి-సల్లని ఒడిలాంటి లఘు చిత్రాల్లో నటి ంచి మెప్పించారు. తాను ఉపాధ్యాయుడిగా పనిచేసి న రాజాపేట మండలం చల్లూరు ఉన్నత పాఠశాలలో 2020-23 సంవత్సరాల్లో పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా స్వయంగా సత్యహరిశ్చంద్ర ఏకపాత్రాభినయం, గొల్ల మల్లయ్య పాత్రలో నటించి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు.

పదుల సంఖ్యలో లఘు చిత్రాలు

యూట్యూబ్‌లోమనం ఛానల్ ద్వారా రెండేండ్లుగా పదుల సంఖ్యలో లఘు చిత్రాలు తీశారు. అంతే కాకుండా లింగారెడ్డి తాను సందర్శించిన కొత్త ప్రదేశాలు ప్రత్యేక ఆకర్షణలు చిత్రీకరించి తన ఛానల్‌లో అందుబాటులో ఉంచుతారు. తిండిబోతు మొగుడు, విలేజ్ శ్రీను 31 ఫస్ట్ దావత్, బావా బాటిల్ కల్లు తెస్తావా, తుంటరి దొంగలు, నీముఖం చూస్తే అంతే, ప్రేమకు హద్దుండాలి లాంటి లఘు చిత్రాలను తీశారు.

పాటల రచయితగా

జైదపురం అంగట్లో జంగయ్య పనీ పాట లేదా పిల్లగా, వాడవాడలా జూడు.. పూల సింగిడి జూడు(బతుకమ్మపాటలు), జగమేలే తల్లికి జే గంటలు (బోనాల పాట), ఇదే ఇదే బృందా వనం(పాఠ శాల ప్రాముఖ్యత పాట) ఇలా అనేక పాటలు లింగారెడ్డికి పాటల రచయితగా గుర్తింపు తెచ్చాయి. ఈ ఏడాది అల్లసాని పెద్దన రచించిన మనుచరిత్ర అనే ప్రబంధం నుంచి తీసుకున్న వరూధిని ప్రవరాఖ్యుల ప్రణయ సన్నివేశాన్ని దృశ్య కావ్యరూపంలో వరూధిని విరహం పేరుతో మనం ఛానల్ ద్వార యూట్యూబ్‌లో విడుదల చేశాడు.

మంచి స్పందన లభిస్తోంది



తెలుగు పాటలలోఅర్థం, పర్థం లేని పదాలతో డీజే మిక్సింగ్‌లతో యువతను ఆకట్టుకునే పాటలు వస్తున్న తరుణంలో ఒక ప్రబంధ నేపథ్యాన్ని చేసుకొని రాసిన వరూధిని విరహం అనే పాటను అందరూ ఆదరించడం చాలా ఆనందంగా ఉంది. ప్రముఖ అర్షకవి, ఆచార్య మసన చెన్నప్ప, సాహితీ విమర్శకులు దాస్యం సేనాధిపతి, సినీ గేయ రచయితలు మౌనశ్రీ మల్లిక్, అభినయ శ్రీనివాస్ లాంటి అనేక మంది పెద్దలు కూడ సాహిత్యాన్ని, దృశ్య కావ్య చిత్రీకరణను చూసి సినిమా పాటలకు తీసిపోని రీతిలో ఉందని ప్రశంసించారు. ఇదిమా శ్రమకు గుర్తింపుగా భావిస్తున్నా.

- రచయిత పెసరు లింగారెడ్డి



గోదాంను పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు సొసైటీల అధ్యక్షులు

'హతూరు' స్ఫూర్తితో సొసైటీల బలోపేతం

● డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ అవార్డు పొందిన హతూరు సొసైటీ అభివృద్ధిని, ఆ సొసైటీ పాలసీలను విధి విధానాలను స్ఫూర్తిగా తీసుకొని ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 107 ప్రాథమిక సహకార సంఘాలను బలోపేతం చేస్తామని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కర్ణాటక రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు జరిగే అధ్యయన యాత్రలో భాగంగా మంగళవారం కొడగు జిల్లాలోని హతూరు పీఏసీఎస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సొసైటీ అధికారులు, ప్రజా ప్రతినిధులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీసీసీబీ చైర్మన్ మాట్లాడుతూ ఈ సొసైటీ జాతీయ స్థాయిలో ఉత్తమ సొసైటీగా ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఆ సొసైటీ పాలకవర్గాన్ని, చైర్మన్‌ను అభినందించారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సొసైటీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాశం సంపత్‌రెడ్డి, ఆలకుంట్ల నాగరత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాలే అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. నాంపల్లి, మర్రిగూడ మండలాలలోని దేవత్‌పల్లి, నాంపల్లి, మాందాపురం, మర్రిగూడ మండలంలోని శివన్నగూడ, కొట్టాల గ్రామాల్లో మంగళవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. గుర్రంపోడు రోడ్డు నుంచి నాంపల్లి కస్తూర్బా పాఠశాల వరకు రూ.15లక్షల వ్యయంతో సీసీ రోడ్డు శంకుస్థాపన, దేవత్‌పల్లి రోడ్డు సాగర్ హైవే రోడ్డు వరకు రూ.4.35 కోట్ల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. మర్రిగూడ మండలంలోని రూ. 10లక్షలతో శివన్నగూడ గ్రామంలో నూతన గ్రామ సచివాలయానికి శంకుస్థాపన, కొట్టాలలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మర్రిగూడ మండలంలోని శివన్నగూడంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు, కమిటీ హాల్, సబ్‌సెంటర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చడమే కాకుండా అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసిందని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో రాందాసు శ్రీనివాస్, రమావత్ శ్రీనివాస్‌నాయక్, మేతరి యాదయ్య, పాశం సురేందర్ రెడ్డి, వెంకటంపేట బాలయ్య, చిట్యాల రంగారెడ్డి, యాదగిరి, నీలిమా చంద్రశేఖర్, మాల్ మార్కెట్ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్ పాల్గొన్నారు.

● డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడ రిజర్వాయర్‌లో ముంపునకు భూ నిర్వాసితులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఏ ఒక్కరూ అధైర్యపడవద్దని, త్వరలోనే పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయనున్నట్లు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. నిర్వాసితులు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని కలవడంతో ఆయన వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట మేతరి యాదయ్య, శ్రీనివాస్, నర్సింహ, వెంకటయ్య ఉన్నారు.



గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట : ఎమ్మెల్యేలు

చింతపల్లి: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం చింతపల్లి మండలంలోని ధైర్యపురితండాలో రూ.10లక్షలతో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, నాయకులు ముచ్చర్ల యాదగిరి, మాజీ ఎంపీపీ కొండూరి భవానీపవన్‌కుమార్, హరినాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నల్లగొండ జిల్లాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగా నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తయినట్లు తెలిపారు. భారత రాజ్యాంగ స్ఫూర్తి, స్వరూప స్వభావాల గురించి వివరించారు. భారత రాజ్యాంగం భారతీయుల గుండె చప్పుడని, రాజ్యాంగస్ఫూర్తిని రాజ్యాంగ విలువలను పెంపొందించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు.

● భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ ఇలా త్రిపాఠి కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో భారత రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞను చేయించారు. మంగళవారం రాష్ట్ర విద్యా కమిషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన విద్యా కమిషన్ రాష్ట్ర చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరు మురళి, సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వర్, వెంకటేష్, జోష్నారెడ్డి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్‌వో అమరేందర్, డీఈవో భిక్షపతి, ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న విద్యావేత్తలు, మేధావులు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు ఈ ప్రతిజ్ఞలో పాల్గొన్నారు.

● భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ప్రాణాలైనా అర్పిస్తామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా చైర్మన్ గోలి సైదులు అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద భారత రాజ్యాంగ పీఠికకు పుష్పార్చన చేశారు. కార్యక్రమంలో విశ్రాంత పోలీస్ ఆఫీసర్ పిచ్చయ్య, అడ్వకేట్ ఎన్నమల్ల రమేష్, జిల్లా కో చైర్మన్లు రేకల సైదులు, తెలగమల్ల యాదగిరి పాల్గొన్నారు.

● దామరచర్ల మండలంలోని బొత్తలపాలెం ఆదర్శ పాఠశాల విద్యార్థులతో ఎంఈవో బాలాజీనాయక్ ప్రతిజ్ఞ చేయించారు. భారత రాజ్యాంగంలోని మౌలిక అంశాలపై విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. బీఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వం నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరహరి, అయూబ్‌ఖాన్, బాబా పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లిలో ఆల్ ఇండియా సమతా సైనిక్‌దళ్ రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవించాలని, రాజ్యాంగం పౌరులకు హక్కులతో పాటు బాధ్యతలు, విధులు కల్పించిందని అన్నారు. కార్యక్రమంలో సంఘం తాలూకా కమిటీ కన్వీనర్ జిల్లా రాములు, యేకుల రాజారావు, ధర్మపురం శ్రీను, యేకుల సురేష్, గ్యార యాదగిరి, సురేష్, రాజేష్, వెంకన్న, సాలయ్య, కొండమల్లేపల్లిలోని జడ్పీహెచ్ఎస్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి హెచ్ఎం నాగేశ్వర్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నల్లగొండ డీఈవో కార్యాలయం వద్ద రాజ్యాంగ పీఠికకు పుష్పాభిషేకం చేస్తున్న నాయకులు

● చిట్యాలలో ఆక్స్‌ఫర్డ్ విద్యాలయం విద్యార్థులు జాతీయోద్యమ నాయకుల వేషధారణలో 200 మీటర్ల భారీ జాతీయ పతాకంతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పెద్ది నరేందర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లిలో ఎంపీడీవో కార్యాలయం, అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద అంబేడ్కర్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ఖలీల్, నాయకులు సాలయ్య, అచ్యుత్, పవన్, ముత్తమయ్య, రామాచారి, పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు దైద శ్రీనివాస్ మాట్లాడుతూ యువత డాక్టర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో పయనించాలని అన్నారు. కార్యక్రమంలో సందీప్‌కుమార్ భాస్కర్, రాజకుమార్ సురేష్, నాగయ్య, సురేందర్, శ్రీకాంత్, లక్ష్మణ్, అవినాష్ పాల్గొన్నారు.

● పెద్దవూర మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేజీబీవీలో నిర్వహించిన సమావేశంలో మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, ఎంఈవో తరి రాము, ఉపాధ్యాయులు జ్యోష్న, నాగలక్ష్మి, సరిత, లావణ్య, సువర్ణ, సరిత, అనుష్క పాల్గొన్నారు.

నేడు సర్వేల్ గురుకుల పాఠశాల భవనం ప్రారంభం

సంస్థాన్‌నారాయణపురం, నవంబరు 26(ఆంధ్ర జ్యోతి): నిర్మాణం పూర్తయి రెండేళ్లకుపైగా నిరుప యోగంగా ఉన్న సర్వేల్ గురుకుల పాఠశాల భవనానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్‌లను తయారు చేసిన పాఠశాల భవనం శిథిలా వస్థకు చేరడంతో గత ప్రభుత్వం రూ. 18.61 కోట్లు మంజూరు చేసింది. దీంతో 2017 జూలై 17న అప్పటి విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి పాఠశాల నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. ఏడాదిలోనే పాఠశాల భవనం పూర్తి కావాల్సి ఉండగా 2022 సంవత్సరంలో పూర్తయింది. అయితే చిన్న, చిన్న సమస్యలతో నేటికీ భవనం నిర్మాణం ప్రారంభానికి నోచుకోలేదు. ఇటీవల ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గురుకుల పాఠ శాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణం పూర్తయిన పాఠశాల భవనం ప్రారంభించడం లేదని విద్యార్థులు తెలిపారు. త్వరలో భవన నిర్మాణాన్ని ప్రారంభిస్తామని అప్పట్లో ఎమ్మెల్యే విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఇందుకోసం ప్రత్యేక నిధుల నుంచి రూ. కోటి కేటాయించారు. ఈనిధులతో ఫర్నిచర్ డైనింగ్ టేబుల్ , బెడ్స్ ఇతర వాటిని సమకూర్చారు. దీంతో అన్ని సౌకర్యాలతో నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 27న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి భవన సముదాయాన్ని ప్రారంభి ంచనున్నారు. దీనికి సంబంధించి అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు. నూతన భవనం ప్రారంభోత్సవం అవుతుండడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న భవన సముదాయం

1న ఆలేరులో కబడ్డీ జిల్లా మహిళా జట్టు ఎంపిక

ఆలేరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆలేరులోని ఫ్రెండ్స్ క్లబ్ ఆవరణలో డిసెంబరు 1న 71వ జిల్లా మహిళా కబడ్డీ జట్టు ఎంపిక చేపడుతున్నట్లు అసోసియేషన్ కబడ్డీ అసోసియేషన్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిజికల్ డైరెక్టర్ పూల నాగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారిణులు 70కిలోల బరువు కలిగి ఉండాలని హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు తీసుకురావాలని సూచించారు. ఎంపికైన జట్టు డిసెంబరు 7 నుంచి 10వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనున్నట్లు వివరించారు. వివరాలకు సెల్: 9848387964, 7702626927 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

పత్తి కొనుగోలు చేయాలి

ఆత్మకూరు(ఎం) మండలకేంద్రంలో రైతుల రాస్తారోకో



ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో ప్రధాన రోడ్డుపై ధర్నా చేస్తున్న పత్తి రైతులు

ఆత్మకూరు(ఎం) నవంబరు 26: (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని సిద్దేశ్వర కాటన్ మిల్లు యాజమాన్యం పత్తి కొనుగోలు చేయడానికి నిరాకరించడంతో మంగళవారం రైతులు ప్రధాన రోడ్డుపై ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పలుగ్రామాల రైతులు మాట్లా డుతూ ఉదయం పత్తి లోడ్లతో వచ్చామని కానీ మిల్లునిర్వాహకులు పత్తి కొనుగోలు చేయడానికి నిరాకరిస్తున్నారని చెప్పారు. అయితే సోమవారం మిల్లులో అగ్ని ప్రమాదం జరిగిన నేపథ్యంలో పత్తి కొనుగోలు చేయవద్దని సీసీఐ అధికారులు ఆదేశించారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం రైతుల ధర్నా విషయాన్ని మిల్లు నిర్వాహకులు సీసీఐ అధికారులకు తెలియజేయడంతో కొనుగోలు చేయాలని ఆదేశించడంతో రైతులు ధర్నా విరమించారు. రైతుల ధర్నాకు సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం, కొరటికల్ మాజీ సర్పంచ్ కోల సత్తయ్య రైతుల మద్దతు తెలిపారు.

బాల బాలికలు క్రీడల్లో రాణించాలి

● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలోని బాలబాలికలు క్రీడల్లో రాణించి తమ ప్రతిభను చాటుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని చెరువుఅన్నారం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ జూనియర్స్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు క్రీడల్లో పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో శాలిగౌరారం రూరల్ సీఐ కొండల్‌రెడ్డి, కట్టంగూరు ఎస్ఐ రవీందర్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య, ఎండీ ఉస్మాన్, ఉపాధ్యాయు లు రాంమోహన్‌రెడ్డి, శ్రీనివాస్, కోటిలింగం, నరహరి పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే వీరేశం

ట్రెక్కింగ్‌కు కేరాఫ్ భువనగిరి ఖిల్లా



యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలోని భువనగిరి ఖిల్లా ట్రెక్కింగ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఉంది. సముద్ర మట్టానికి సుమారు 502 మీటర్లు(1506 అడుగులు) ఎత్తుతో చారిత్రక సంపదకు, పలు రాజ వంశాల పాలనకు సాక్ష్యంగా ఉన్న ఏకశిలా పర్వతం భువనగిరి ఖిల్లా ఇప్పుడు సాహస క్రీడలకు నెలవుగా ఉంది. పర్వతారోహకులకు ప్రాథమిక శిక్షణ ఇక్కడి నుంచే ప్రారంభమవుతుంది. ఇక్కడ శిక్షణ పొందిన వారిలో 98 మంది ఎవరెస్ట్ శిఖరాన్ని, మరో 800 మంది ప్రపంచంలోని ఎత్తైన పర్వతాలు అధిరోహించిన ఘనత సాధించారు. (ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

భువనగిరి ఖిల్లాపై పర్వతారోహణలో శిక్షణ పొందిన ఔత్సాహికులు పలురికార్డులు సృష్టించారు. 14ఏళ్ల వయస్సులో ఎవరెస్ట్‌ను అధిరోహించిన అతిచిన్న పర్వతారోహకురాలిగా పూర్ణ రికార్డు సృష్టించింది. ప్రపంచంలోనే ఎత్తైన ఏడు పర్వతాల్లో నాలుగింటిని అధిరోహించి మరో మూడు పర్వతాల లక్ష్య సాధనలో పడమటి అన్విత ఉంది. సుమారు 50వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు భువనగిరి ఖిల్లాపైనే పర్వ తారోహణలో శిక్షణ పొందడం కూడా రికార్డుగా పేర్కొంటారు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు ఖిల్లాను సందర్శించి పర్వతారోహణలో ప్రాథమిక శిక్షణ పొందుతుంటారు. పలువురు సీనియర్ సివిల్ సర్వీసెస్ అధికారులు, విదేశీ పర్వతారోహకులు ఖిల్లాను తరుచూ సందర్శిస్తుంటారు.

ఇక్కడి శిక్షణతోనే ప్రపంచ రికార్డులు సృష్టించా




భువనగిరి ఖిల్లాపై పర్వతారోహణపై ప్రాథమిక శిక్షణ పొందిన నేను ప్రపంచ రికార్డును తిరగరాశాను. 14 సంవత్సరాల వయస్సులో ఎస్సీ హాస్టల్ విద్యార్థినిగా మరో పర్వతారోహకుడు ఆనంద్‌తో కలిసి 2014లో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాను. దీంతో అతిపిన్న ఎవరెస్టర్‌గా రికార్డు నా సొంతమైంది. ఇప్పటి వరకు ఆ రికార్డు నాపేరిటే ఉన్నది.

పూర్ణ, పర్వతారోహకురాలు.

బుకింగ్ ఇలా..

తెలంగాణ పర్యాటక శాఖ, ట్రాన్సెండ్ అడ్వెంచరీస్ ఆఫ్ రాక్ క్లైంబింగ్ సంయుక్తంగా ఖిల్లాపై ట్రెక్కింగ్‌కు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. ఇందుకు కేటగిరీలు, ప్యాకేజీల వారిగా ఆన్‌లైన్‌లోనే ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఖిల్లా దిగువ భాగంలో ఉన్న రాక్ క్లైంబింగ్ కార్యాలయానికి వచ్చినా అక్కడే స్లాట్ బుక్ చేసి ట్రెక్కింగ్‌కు అనుమతి ఇస్తారు. అదనపు ఆకర్షణగా ఖిల్లా దిగువ భాగంలో రాత్రి బస చేసేందుకు ప్రత్యేక గుడారాలు అందుబాటులో ఉంటాయి. వీటిని కూడా ఆన్‌లైన్‌లోనే బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ గండికోట, వరంగల్‌లో ట్రెక్కింగ్ కోసం కూడా ఇదే వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకునే సౌకర్యం ఉంటుంది. ఆసక్తిగల వారు వెబ్‌సైట్ www.gotarc.in, findyourpea-k@-gotarc.comలో పేర్లను నమోదు చేసుకోవచ్చు. సమాచారం కోసం సెల్ 9666088821, 8121555734, 9666788808లో సంప్రదించాలి.

ఇక్కడి నుంచే పర్వతారోహకులకు ప్రాథమిక శిక్షణ



శిక్షణకు మేలైన పర్వతంగా..

పర్వతారోహణకు మేలైన పర్వతంగా భువనగిరి ఖిల్లా ఉంది. ఈ ఖిల్లాపై పర్వతారోహణ శిక్షణ కోసం ఎవరెస్టర్ బీ శేఖర్‌బాబు నెలకొల్పిన భువనగిరి రాక్ క్లైంబింగ్ స్కూల్‌ను 2013 సెప్టెంబరులో రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి చందనాఖాన్ ప్రారంభించారు. ఆ తర్వాత ట్రాన్సెండ్ అకాడమీ ఆఫ్ రాక్ క్లైంబింగ్‌గా రూపాంతరం చెందింది. శిక్షణ పొందిన వారు ఎవరెస్టు, కిలిమంజారో, ఎల్‌బ్రూస్, తదితర పర్వతాలను అధిరోహించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన 50వేల మంది విద్యార్థులు ఈ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ పొందారు. సెలవు రోజుల్లో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఔత్సాహికులు ఖిల్లాపై రాక్ క్లైంబింగ్, రాప్లింగ్ చేస్తుంటారు. అమెరికా, రష్యా, లండన్, కెనడా తదితర దేశాలకు చెందిన పలువురు పర్వతారోహకులు ప్రతి ఏడాది భువనగిరి ఖిల్లాకు వచ్చి తమ నైపుణ్యాన్ని మెరుగు పర్చుకుంటుంటారు.

శిక్షణ ఇలా..

ట్రాన్సెండ్ అకాడమీ ఆఫ్ రాక్ క్లైంబింగ్ ఆధ్వర్యంలో ఎవరెస్టర్స్ పడమటి అన్విత, పూర్ణ, ఆనంద్, రాజేష్ పర్యవేక్షణలో శిక్షణ కొనసాగుతోంది. ఔత్సాహికులకు ప్రొఫెషనల్ కోర్సులు, ఇతరులకు ప్రాథమిక శిక్షణ, ఒక రోజు రాక్ క్లైంబింగ్, రాప్లింగ్ విధానంలో శిక్షణ ఇస్తారు. ప్రొఫెషనల్స్‌కు ఏడాది పాటు దఫాల వారిగా, విద్యార్థులు, ఇతరులకు ఒకటి నుంచి ఐదు రోజులు కేటగిరీల వారిగా శిక్షణ ఉంటుంది. ఎవరెస్ట్ తదితర పర్వతాలను అధిరోహించాలనుకునే ఔత్సాహికులకు ఎవరెస్టర్ శేఖర్ బాబు పర్యవేక్షణలో దేశంలోని పలు పర్వతాలపై కూడా శిక్షణ ఇస్తారు. ట్రాన్సెండ్ అకాడమీ ఆఫ్‌రాక్ క్లైంబింగ్‌లో శిక్షణ పొందిన వారికి ఇచ్చే సర్టిఫికెట్లతో కోచ్‌లుగా ఉపాధి పొందవచ్చు. ఇప్పటి వరకు పలువురికి ఉద్యోగాలు కూడా లభించాయి.

భువనగిరి ఖిల్లాను ఎక్కుతున్న అన్విత

● ట్రెక్కింగ్‌కు అత్యుత్తమం



భువనగికి ఖిల్లా ట్రెక్కింగ్‌కు అత్యుత్తమంగా ఉంటుంది. నేను పలు సార్లు భువనగిరి ఖిల్లాపై పర్వతారోహణ చేశాను. ఇక్కడ ప్రాథమిక శిక్షణ పొందిన వారు పర్వతారోహణలో మెలకువలను తెలుసుకోవచ్చు. భువనగిరి ఖిల్లా స్వరూపం ట్రెక్కింగ్‌కు, సాహస క్రీడలకు అనువుగా ఉంటుంది.

● తరుణ్ జోషి, ఐపీఎస్ అధికారి.

● ఎవరెస్టర్స్ కేరాఫ్ భువనగిరి ఖిల్లా



భువనగిరి ఖిల్లా కేరాఫ్ ఎవరెస్టర్స్‌గా ప్రసిద్ధి. పర్వతారోహణలో ఖిల్లాపై శిక్షణ పొందిన వారిలో 98 మంది ఎవరెస్ట్ పర్వతాన్ని, మరో 800 మంది కిలిమంజారో తదితర ఎత్తైన పర్వతాలను అధిరోహించారు. అలాగే ట్రెక్కింగ్‌ను ఇష్టపడే ఔత్సాహికులకు కూడా భువనగికి ఖిల్లాకు ప్రాధాన్యమిస్తూ నిత్యం సందర్శిస్తున్నారు.

బీ శేఖర్‌బాబు, ఎవరెస్టర్, ఎండీ, ట్రాన్సెండ్ అడ్వెంచర్స్

నన్ను ప్రపంచానికి పరిచయం చేసిన ఖిల్లా



నేను డిగ్రీ చదువుకునే వరకు ఓ సాధారణ విద్యార్థినిని. కానీ విద్యార్థి దశలోనే భువనగిరి ఖిల్లాపై సాగుతున్న శిక్షణతో ఆసక్తి పెంచుకొని ఎంబీఏలో చేరాక పూర్తిస్థాయి పర్వతారోహణ శిక్షణను భువనగిరి ఖిల్లాపై పూర్తి చేసి ఎవరెస్ట్ సహా ప్రపంచంలోని మరో 3 ఎత్తైన పర్వతాలను అధిరోహించడంతో నేను ప్రపంచానికి పరిచయమయ్యా.

● పడమటి అన్విత, ఎవరెస్టర్.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.129	208	236
సూర్యాపేట	రూ.120	180	200
నల్లగొండ	రూ.130	190	220

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	586.80
టీఎంసీలు	304.4680
ఎడమకాల్వకు నీటి విడుదల	3431
కుడికాల్వకు	10,000
విద్యుత్ కేంద్రం ద్వారా	20,787
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	35,315
అవుట్‌ఫ్లో	36,918క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	43.54 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	330 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	2వేల క్యూసెక్కులు

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.41 అడుగులు
టీఎంసీలు	4.41
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	388.46 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	98.10 క్యూసెక్కులు

వారసత్వ సంపదను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న నాగలక్ష్మి

భువనగిరి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వారసత్వ, చారిత్రక సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పురావస్తుశాఖ ఉప సంచాలకులు నాగలక్ష్మి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో మంగళవారం జరిగిన ప్రపంచ వారసత్వ వారోత్సవాల ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశ సాంస్కృతిక వైభవాన్ని వారసత్వ, చారిత్రక కట్టడాలు, ప్రదేశాల ద్వారా భవిష్యత్తు తరాలకు అందించాలన్నారు. ఇందుకు పురావస్తు శాఖ చేస్తున్న కృషికి అందరూ సహకరించాలన్నారు. భువనగిరి ఖిల్లాతో తెలంగాణకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు లభిస్తోందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభాపాటవ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగవర్ధన్ రెడ్డి, పర్వతారోహకురాలు పడమటి అన్విత, హెరిటేజ్ కమిటీ సభ్యులు సద్ది వెంకటరెడ్డి, జంపాల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలిక బలవన్మరణం



సౌమ్య మృతదేహం

తిరుమలగిరి(సాగర్), నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలకేంద్రంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ వీరశేఖర్, తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి(సాగర్)కు చెందిన మునగాల రాంబాబు, రేణుక రెండో కూతురు సౌమ్య(13) మిర్యాలగూడ మండలం శ్రీనివాస్ నగర్ వద్దగల బీసీ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. అనారోగ్యంతో ఉండడంతో ఐదు రోజుల క్రితం తల్లిదండ్రులు ఇంటికి తీసుకొచ్చారు. మంగళవారం ఉదయం తండ్రి రాంబాబు మిర్యాలగూడ మండలం అవంతీపురం వద్ద సంతకు, తల్లి రేణుక పశువులను మేపడానికి వెళ్లారు. సాయంత్రం 4.30 గంటల తర్వాత ఆరు సంవత్సరాల రాంబాబు కుమారుడు స్థానిక ప్రైవేట్ పా ఠశాల నుంచి ఇంటికి వచ్చాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా అక్క సౌమ్య ఫ్యాన్‌కు వేలాడుతుండడంతో ఇంటి బయటకు వచ్చి కూర్చున్నాడు. కొద్దిసేపటికే తండ్రి రాంబాబు ఇంటికి రాగానే అక్క ఫ్యాన్‌కు వేలాడుతోందని చెప్పడంతో ఇంట్లోకి వెళ్లిచూడగా సౌమ్యఅప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వీరశేఖర్ సంఘటనా స్థలానికి విచారణ నిర్వహించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డీఈవోపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్‌కు వెళితే తమపైనే అక్రమ కేసులు బనాయించారని, తన భర్త నల్లగొండ డీఈవో భిక్షపతిపై చర్యలు తీసుకోవాలని డీఈవో భిక్షపతి భార్య మాధవి మంగళవారం ఏఎస్పీ రాములునాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని కాపురం చేస్తున్నారని తెలిసి ఆరు రోజుల క్రితం వారు ఉండే ఇంటికి వెళ్లి నిలదీశానని, ఆ విషయంపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. భిక్షపతిపై టూటౌన్ ఎస్ఐ కేసు నమోదు చేయకుండా తమ పైనే కేసు నమోదు చేశారని తెలిపారు. 2010 ఆగస్టులో తాము హిందూ సాంప్రదాయం ప్రకారం కుటుంబసభ్యులు, పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నామని తెలిపారు. కొద్ది రోజులకే తనను వదిలేశారని, ఈ కేసు కోర్టు పరిధిలో ఉన్నా పట్టించుకోకుండా వేరే మహిళతో ఉంటూ ముగ్గురు పిల్లలను కన్నారని పేర్కొన్నారు. తన భర్త భిక్షపతిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. డీఈవో భిక్షపతిపై బుధవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. అవసరమైతే డీజీపీని సైతం కలిసి వివరిస్తానన్నారు. ఎక్కడా న్యాయం జరగకపోతే మహిళా కమిషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తానని పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తుతెలియని మృతదేహం

చింతపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్‌లో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 50 ఏళ్ల వయస్సున్న గుర్తుతెలియని వ్యక్తి భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మాల్ మార్కెట్ యార్డులోని షాపు నంబర్-8 వద్ద పడిపోయి ఉన్న గుర్తుతెలియని వ్యక్తిని మార్కెట్ కార్యదర్శి వేణుకుమార్ గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి

మోత్కూరు, (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం అడ్డగూడూరు మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన మాదాను ఆరోగ్యం(65) ఓ వీధిలో పడిపోయి మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్యానికి బానిసై, మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. ఎవరైనా అన్నం పెడితే తిని కాలం గడుపుతున్నాడు. మంగళవారం గాయత్రి బ్యాంకు పక్క వీధిలో కిందపడిపోయి మృతిచెందాడు. సమాచారం తెలుసుకుని గ్రామపెద్దలు వచ్చి ఆయన మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

దోరకుంటలో లారీ దగ్ధం

కోదాడ రూరల్, నవంబరు 26,(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టి దగ్ధమైంది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని దోరకుంట వద్ద మంగళవారం జరిగింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ నుంచి బియ్యం లోడ్‌తో వెళ్తున్న లారీ దోరకుంట గ్రామశివారులో బ్రేక్ ఫెయిల్ కావడంతో లారీని డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపాడు. మట్టపల్లి నుంచి నాగార్జున సిమెంట్ క్లింకర్ లారీ విజయవాడ దగ్గరలోని ఇబ్రహీంపట్నంలోని కొండపల్లికి వెళ్తున్నండగా దోరకుంట వద్ద ఆగిఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆగిఉన్న బియ్యం లారీ పక్కకు కదిలింది. క్లింకర్ లారీలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. లారీ రోడ్డుపై అడ్డంగా పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లారీని తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కోదాడ నుంచి విజయవాడకు వెళ్తున్న బియ్యం లారీ రేషన్ బియ్యం తరలిస్తున్న లారీగా అనుమానం వచ్చి వెంటనే రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు పరిశీలించారు.

యాదగిరీశుడికి ఘనంగా లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఏకాదశి పూజలు మంగళవారం శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తులను వివిధ పుష్పమాలికలు, పట్టువస్త్రాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకస్వాములు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్ర నామ పఠనాలు, వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు. పాంచరాత్రాగమ రీతిలో గంట పాటు పూజా పర్వం కొనసాగింది.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో వేదమంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమల పాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ప్రధానాలయంలో స్వయం భూవులను సుప్రభాత సేవలతో మేల్కొల్పి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖ మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పంచారాత్రగమశాస్త్ర రీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటికమూర్తులకు పూజలు, నిత్య రుద్రహవనం కొనసాగాయి.

సత్యేదేవుని వ్రతాల్లో పాల్గొన్న 612 జంటలు

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కొండకింద వ్రత మండపాల్లో 612 జంటలు సత్యేదేవుని వ్రతాల్లో పాల్గొన్నాయి. కొండపైన ఉత్తర తిరువీధి, శివాలయం, కొండకింద లక్ష్మీపుష్కరిణి, వ్రత మండపం, వైకుంఠద్వారం వద్ద మహిళ భక్తులు దీపారాధనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఏటా తులసి దామోదర కల్యాణం, సత్యదేవుని వ్రతంతో పాటు కార్తీక మాసం చివరి వారంలో వన భోజనాల మాదిరిగానే ఈ ఏడాది కూడా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ఈ నెల 29న స్వామివారి స్వాతీ నక్షత్రం రోజు గిరిప్రదక్షిణ ముగిసిన వెంటనే ఉదయం 10.30 గంటలకు మండలంలోని మల్లాపురం గోశాలలో పూజలు నిర్వహిస్తారని తెలిపారు.

పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే కత్తితో దాడి

● భార్య పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని కత్తిపోట్లు ● రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసిన భర్త ● స్టేషన్‌లో ఉన్న వ్యక్తిని బయటకు పిలిపించి ఘాతుకం

తిరుమలగిరి(సాగర్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భార్య పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఆగ్రహిస్తూ ఓ వ్యక్తిపై భర్త పోలీస్‌స్టేషన్ ఆవరణలో కత్తితో దాడి చేశాడు. మంగళవారం నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఈ సంఘటన జరిగింది. తిరుమలగిరి(సాగర్) మండలం కీచ్యాతండాకు చెందిన సపావత్ మునినాయక్ ఈ నెల 17వ తేదీన తన ఇంటికి వచ్చి భార్యను వేధింపులకు గురిచేశాడని సపావత్ మోహన్, భార్య సంధ్యతో కలిసి ఈ నెల 19వ తేదీన స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై మునినాయక్‌పై కేసు నమోదైంది. మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో మోహన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. అక్కడ ఉన్న మునినాయక్‌ను గమనించి కేసు విషయమై మాట్లాడేందుకు బయటకు పిలిపించాడు. పోలీసు వాహనాలు నిలిపే స్థలం వద్దకు రాగా, తన వెంట తెచ్చుకున్న కత్తితో ఒక్కసారిగా మునిపై కడుపు, వీపు వెనుక భాగం, చేతిపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. దీంతో నిర్ఘాంతపోయిన పోలీసులు, స్థానికులు వెంటనే మోహన్‌ను పట్టుకున్నారు. అప్పటికే తీవ్ర గాయాలతో రక్తస్రావం అవుతుండడంతో మునిని పోలీసు వాహనంలోనే చికిత్స నిమిత్తం నల్లగొండ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న నాగార్జునసాగర్ సీఐ బీసన్న, ఎస్ఐలు వీరశేఖర్, వీరబాబు ఉద్రిక్త పరిస్థితి చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే కత్తితో దాడికి పాల్పడ్డ సంఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. ఈ ఘటనపై జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.



సంఘటనా స్థలంలో పంచనామా నిర్వహిస్తున్న ఎస్ఐ వీరశేఖర్

శిథిల భవనం తొలగింపు..



బ్రిటీష్ కాలంలో సూర్యాపేట జిల్లా మునగాలలో నిర్మించిన ఆర్అండ్‌బీ బంగ్లా శిథిలావస్థకు చేరింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ శిథిల భవనాన్ని ఎక్స్‌కవేటర్‌తో మంగళవారం కూల్చివేసినట్లు తహసీల్దార్ ఆంజనేయులు, వైద్యాధికారి రవీందర్ తెలిపారు. కొన్నేళ్ల నుంచి ఆర్ అండ్‌బీ బంగ్లాలో ప్రభుత్వ వైద్యశాల కొనసాగింది. భవనం శిథిలావస్థకు చేరడంతో దాని వెనుక ఉన్న స్థలంలో నూతన వైద్యశాల నిర్మించారు. ఆ భవనం ప్రారంభించాలని శిథిలావస్థకు చేరిన బంగ్లాను కూల్చినట్లు అధికారులు తెలిపారు. ● మునగాల, (ఆంధ్రజ్యోతి).

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

● నల్లగొండ రెండో ఎస్సీ ఎస్టీ పీఏ యాక్ట్ సెషన్స్ కోర్టు తీర్పు ● ఇద్దరు నిందితులు చర్లపల్లి, మహిళ నిందితురాలు చంచలగూడ జైలుకు తరలింపు

నల్లగొండ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన అప్పు అడిగినందుకు పథకం ప్రకారం ఇద్దరిని హత్య చేసిన కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ నల్లగొండ రెండో ఎస్సీ ఎస్టీ పీఏ యాక్ట్ సెషన్స్ జడ్జి రోజారమణి మంగళవారం తీర్పు ఇచ్చారు. ఏఎస్పీ రాములునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని కుమ్మరిగూడెం(చిన్నమాదారం) గ్రామానికి చెందిన మల్లికంటి వెంకటేశ్వర్లు, నల్లగొండ పట్టణానికి చెందిన బొంద రవికుమార్, ఎస్‌కే. గౌస్‌ల వద్ద డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. కొంతకాలానికి డబ్బులు ఇచ్చిన వారు అడిగితే వివిధ కారణాలు చెబుతూ తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో రవికుమార్ అతని స్నేహితుడు గౌస్ కలిసి వెంకటేశ్వర్లును నిలదీశారు. దీంతో వారిపై కక్ష పెంచుకున్న వెంకటేశ్వర్లు రవికుమార్, గౌస్‌లను ఎలాగైనా అంతమొందించాలని పథకం వేశాడు. వెంకటేశ్వర్లు అతని తమ్ముడు మల్లికంటి యాదగిరి, వెంకటేశ్వర్లు భార్య శోభ కలిసి 2014 ఆగస్టు 7వ తేదీన డబ్బులు ఇస్తామని రవికుమార్, గౌస్‌లకు వెంకటేశ్వర్లు సోదరుడు యాదగిరి ఫోన్ చేసి కుమ్మరిగూడేనికి రావాలని పిలిచాడు. అక్కడికి వచ్చిన రవికుమార్, గౌస్‌లను వెంకటేశ్వర్లు, యాదగిరి, శోభ కలిసి విచక్షణారహితంగా కత్తులతో పొడిచి హత్య చేశారు. యాదగిరి అల్లుడు విద్యాసాగర్ ఫిర్యాదు మేరకు కనగల్ పోలీస్‌స్టేషన్‌లో వెంకటేశ్వర్లు, యాదగిరి, శోభపై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టుకు సరైన ఆధారాలను సమర్పించగా మంగళవారం జిల్లా కోర్టులో విచారణ అనంతరం నిందితులకు జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. జీవిత ఖైదు శిక్ష పడిన శోభను చంచలగూడ జైలుకు, వెంకటేశ్వర్లు, యాదగిరిని చర్లపల్లి జైలుకు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. ఈ కేసులో సరైన ఆధారాలు సేకరించి కోర్టుకు అందజేసి నిందితులకు శిక్ష పడే విధంగా చేసిన అప్పటి విచారణ అధికారులు, ప్రస్తుత ఏఎస్పీ రాములునాయక్, ప్రస్తుత డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, అప్పటి డీఎస్పీ రాంమోహన్‌రావు, సీఐ సుబ్బిరామిరెడ్డి, ఎస్ఐ పరమేష్, ప్రస్తుత సీఐ చందూరు వెంకటయ్య, కనగల్ ఎస్ఐ విష్ణుమూర్తి, ఏపీపీ అఖిలప్రియ, సీడీవో పీసీలు శేఖర్, నగేష్, లైజనింగ్ ఆఫీసర్లు, హెచ్‌సీ పి.నరేందర్, పీసీ ఎస్ మల్లిఖార్జున్‌లను ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించారు.

ఓయూ మహిళా కబడ్డీ జట్టు కెప్టెన్‌గా శృతి



నేరేడుచర్ల, నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయం మహిళా కబడ్డీ జట్టు కెప్టెన్‌గా సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన తమ్మిశెట్టి శృతి ఎంపికైంది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యనభ్యసించిన శృతి ప్రస్తుతం ఆంధ్రమహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. తమిళనాడులోని కరికిడి అలగప్ప యూనివర్సిటీలో ఈ నెల 29 నుంచి డిసెంబరు 2 వరకు నిర్వహించే సౌత్ జోన్‌లో కబడ్డీ పోటీలకు ఉస్మానియా యూనివర్సిటీ మహిళా కబడ్డీ జట్టుకు శృతి కెప్టెన్‌గా వ్యవహరించనుంది. 60 యూనివర్సిటీలకు చెందిన జట్లు పాల్గొననున్నట్లు శృతి తెలిపింది. శృతి ఎంపికపై నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, వ్యాయామ ఉపాధ్యాయుడు రవి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ..

ఆత్మకూరు(ఎం) నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అంత్యక్రియలకు వెళ్లి వస్తూ ఓ వృద్ధుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని కూరెళ్ల గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కూరెళ్ల గ్రామంలో మారుపాక వీరయ్య మంగళవారం మృతిచెందాడు. అదే గ్రామానికి చెందిన మారుపాక ఉప్పలయ్య(75) వీరయ్య అంత్యక్రియలకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి బైక్‌తో ఉప్పలయ్యను వెనుకనుంచి ఢీకొట్టాడు. దీంతో ఉప్పలయ్య ఒక్కసారిగా కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఉప్ప లయ్య కుటుంబ సభ్యులు అతనిని వెంటనే భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించగా మార్గ మధ్యలో ఉప్పలయ్య మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఉప్పలయ్యను బైక్‌తో ఢీకొట్టిన వ్యక్తి పరారయ్యాడు.

రాజ్యాంగ సమగ్రతను ప్రతిఒక్కరూ కాపాడాలి

జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాజ్యాంగా పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహిచారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ప్రభుత్వాలు అమలు చేయాలని, రాజ్యాంగాన్ని కాపడటానికి ప్రతిఒక్కరు కంకణబద్ధులై ఉండాలని కోరారు.

● ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్

● రాజ్యాంగ సమగ్రతను కాపాడేందుకు ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం తిరుమలగిరిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, వై.నరేష్, జుమ్మీలాల్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

● రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి శ్యామ్, జూనియర్ సివిల్ జడ్జి మారుతిప్రసాద్ కోరారు. హుజూర్‌నగర్‌లో న్యాయవాదుల దినోత్సవం, రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడారు. కోదాడలో జరిగిన కార్యక్రమంలో కోదాడ ప్రిన్సిపల్ అడిషినల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.భవ్య మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు. సూర్యాపేటలోని ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రెటరీ పి.శ్రీవాణి మాట్లాడుతూ లక్ష్యంతో విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు.

● అంబేద్కర్ ఆలోచనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీనివాస్ కోరారు. పెన్‌పహాడ్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో రవి, కత్తి రవీందర్ పాల్గొన్నారు.

● నేరేడుచర్ల మునిసిపాలిటీలో, స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు అనంతరం పట్టణ వీధులలో ర్యాలీ నిర్వహించి రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేసి, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ప్రకాష్, కౌన్సిలర్లు కొణతం చినవెంకటరెడ్డి, రణపంగ నాగయ్య, కమిషనర్ అశోక్‌రెడ్డి,హెచ్‌ఎం బి.మధు పాల్గొన్నారు.

● కోదాడలోని బాలర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యాంగ పీఠికపై ఎంఈవో సలీంషరీఫ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం డి.మార్కండేయ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన మానవహారం స్థానికులను ఆకట్టుకుంది.

● తిరుమలగిరి మండలంలోని రాజ్యానాయక్‌తండా, కోట్యానాయక్ తండా రాజ్యాంగ పరిరక్షణపై గ్రామస్థులతో డిప్యూటీ తహసీల్దారు జానీమహ్మద్ ప్రతిజ్ఞ చేయించారు.రాజ్యానాయక్‌తండాలో, తుంగతుర్తిలో గ్రామ పంచాయతీ సిబ్బందిని సన్మానించారు. పాలకవీడులోని ఉన్నత పాఠశాలలో వివిధ పోటీల్లో విజేతలకు ఎంఈవో ఈ.కాటయ్య బహుమతులు అందజేశారు.

● పెన్‌పహాడ్ మండలంలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో రైతు శ్రీజ్యోతి ఇంటి ప్రాంగణంలో పశువుల పాక నిర్మాణానికి 'ఉపాధి నిధులు రూ.84వేలు మంజూరు కాగా, ఆ పనులను పౌరసరఫరాల శాఖ డీఎం ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం సింగారెడ్డిపాలెం గ్రామంలో పంచాయతీ కార్మికుడు మామిడి లచ్చయ్యను, గ్రామంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించిన 'ఉపాధి' కూలీలు జయమ్మ, మౌలాబీలను సన్మానించారు.

● మఠంపల్లిలో రాజ్యాంగంపై ఉపాధిహామీ సిబ్బంది, కూలీలతో ఎంపీడీవో బానాల శ్రీనివాస్ ప్రతిజ్ఞ చేయించారు. మునగాలలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల అధ్యక్షులు గుడిపాటి కనకయ్య, ఎల్.శ్రీనుల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. గరిడేపల్లిలో రూఫ్ వాటర్ హార్వెస్ట్ స్ట్రక్చర్‌కు మాజీ జడ్పీటీసీ పెండెం శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.



తిరుమలగిరిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సామేలు

● హుజూర్‌నగర్‌లో గుండెపంగు రమేష్, గంధం పాండు, షేక్ బషీర్, బాషబోయిన భాస్కర్ ఆధ్వర్యంలో రాజ్యంగ దినోత్సవాన్ని నిర్వహించారు. మసీదు చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు, పిడమర్తి గాంధీ తదితరులు నివాళులర్పించారు.

● కోదాడలోని అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో, అనంతగిరిలో అంబేద్కర్ విగ్రహాలకు కేంద్ర, సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ జిల్లా సహాయకుడు జి.కోటేశ్వరరావు నివాళులర్పించారు.

● సూర్యాపేటలో అంబేద్కర్ విగ్రహానికి టీఎమ్మార్పీఎస్ నాయకులు తప్పెట్ల శ్రీరాములుమాదిగ, బీఎస్పీ రాష్ట్ర, జిల్లా నాయకులు దయాకర్‌మౌర్య, చెరుకు కిరణ్ అన్నారు.తుంగతుర్తిలో అంబేద్కర్ విగ్రహానికి మాదిగ జేఏసీ చైర్మన్ పిడమర్తి రవి నివాళులర్పించారు.

29 నుంచి సీపీఎం మహాసభలు

పెన్‌పహాడ్, తుంగతుర్తి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈ నెల 29, 30, డిసెంబరు ఒకటో తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దనియాకుల శ్రీకాంత్‌వర్మ కోరారు. మంగళవారం పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం, అన్నారంబ్రిడ్జీ గ్రామాల్లో మహాసభల కరపత్రాలు, పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు.

తుంగతుర్తి (ఆంధ్రజ్యోతి): సూర్యాపేటలో ఈనెల 29న జరిగే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

డిసెంబరు 1న సింహగర్జన సభ

చిలుకూరు, హుజూర్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో డిసెంబరు ఒకటో తేదీన నిర్వహి స్తున్న మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు నాయకుడు చేపూరి కొండలు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో మాలమహానాడు ఆధ్వర్యంలో సింహగర్జన సభ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. . ఈ కార్యక్రమంలో మాదాసు రాజు, చిన్న ముత్యాలు, శంబయ్య పాల్గొన్నారు.

● మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కోలపూడి యోహాన్ కోరారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. . సమావేశంలో శ్రీను, వెంకన్న, రాము, గోపి, యల్లయ్య పాల్గొన్నారు.

'ఉపాధి' పనులను సద్వినియోగం చేసుకోవాలి

చిలుకూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పశువుల షెడ్ల నిర్మాణం కోసం ఉపాధిహామీ పథకాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీవో గిరిబాబు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో పశువుల షెడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షరీఫుద్దీన్, టీఏ స్రవంతి, బిల్ కలెక్టర్ ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ప్రమాద బీమా ఉండాలి

తుంగతుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ ప్రమాద బీమా ఉండాలని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన చుంచు కావేరి భర్త నర్సింహ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ, గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డ్రైవర్ బీమా పథకం నుంచి రూ.5లక్షలు మంజూరు కాగా, ఈ చెక్కును నర్సింహ కుటుంబ సభ్యులకు కిషోర్‌కుమార్ మంగళవారం అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ప్రసాద్, సత్యనారాయణ, సోమేష్, రాములు, సాయిలు పాల్గొన్నారు.

విద్యుత్ సవరణ బిల్లును రద్దుచేయాలి

హుజూర్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి చింతకాయల రాము, మేకల నాగేశ్వరరావు కోరారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా నాలుగు లేబర్ కోడ్‌లను, విద్యుత్ సవరణ బిల్లును ఏర్పాటుచేసి కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జీవోలను రద్దుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అమర్‌నాథ్‌రెడ్డి, సావిత్రి, నాగేందర్, వెంకటేశ్వర్లు, శ్రీను, వీరస్వామి, విజయ్ పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి



సూర్యాపేటలో ధర్నా చేస్తున్న నాయకులు

సూర్యాపేట టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు పేర్ల నాగయ్య, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శంకర్‌విలాస్ సెంటరులో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కారింగుల వెంకన్న,రేణుక, అఖిల్‌కుమార్, గొడ్డలి నర్సయ్య, సయ్యద్ హుస్సేన్, మారసాని చంద్రకళ, సంతోషిమాత, సూరం రేణుక, జయమ్మ, ఉపేందర్, జానయ్య, పద్మ పాల్గొన్నారు.

● కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లా కేంద్రంలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు మండారి డేవిడ్‌కుమార్, దండ వెంకట్‌రెడ్డి, కంబాల శ్రీను, మేకల శ్రీనివాస్, నెమ్మాది వెంకటేశ్వర్లు, గంట నాగయ్య, నజీర్, వెంకటయ్య, రెబల్‌శ్రీను, బొడ్డు శంకర్, దూళిపాళ దనుంజయనాయుడు, మధుసూధన్‌రెడ్డి, దశరథ, కునుకుంట్ల సైదులు, కిరణ్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పవిత్రోత్సవాలు

సూర్యాపేట టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో మంగళవారం పవిత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామున ఆరాధన, మహాపూర్ణాహుతి, శతఘటాబిషేకం, 108 కలశాలతో ఆరాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల మురళీధరాచార్యులు మాట్లాడుతూ పవిత్రోత్సవాల్లో బాగంగా స్వామివారికి పవిత్రాలతో అలంకరించామన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.

సామాజిక కార్యక్రమాలు అభినందనీయం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న రిటైర్డు ఉద్యోగులు

కోదాడ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఉద్యోగులు చేపడుతున్న సామాజిక కార్యక్రమాలు అభినందనీయమని పట్టణ ప్రముఖ వైద్యుడు సుబ్బారావు, డాక్టర్ రామారావు, ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్డులోని మామిడి తోటలో రిటైర్డు ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. రిటైర్డు అనంతరం కోదాడలో కార్తీక మాస వన భోజనాలు, సామూహిక పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగుల సంఘం కోదాడ యూనిట్ అధ్యక్షుడు వి.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బొల్లు రాంబాబు, రఘు, వరప్రసాద్, పొట్ట జగన్మోహన్, విద్యాసాగర్, అమృతారెడ్డి, భ్రమరాంబ శోభ, నరసయ్య, వరప్రసాద్ పాల్గొన్నారు.

పెన్షనర్లకు నగదు రహిత వైద్య సౌకర్యం కల్పించాలి

సూర్యాపేట టౌన్ (ఆంధ్రజ్యోతి): పెన్షనర్‌లకు నగదు రహిత వైద్య సౌకర్యం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.సీతారామయ్య కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆసంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్.సుదర్శన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రాంబాబు, సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

హుజూర్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం నాయకులు ముత్తినేని వెంకటేశ్వరరావు, మేకల నాగేశ్వరరావు, కేఎల్ఎన్ రావు, కాకి అజయ్‌కుమార్ కోరారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికలకు ముందు తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయాలన్నారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఉచిత బస్సు పాస్ సౌకర్యం, విద్య, వైద్యం, పింఛను అందించాలని కోరారు. ఉద్యమకారులకు ఆరు గ్యారంటీ పథకాలను వర్తింపజేయాలన్నారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పీఏ వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటమ్మ, చెలీనమ్మ, చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, ఉమామహేశ్వరరావు, నర్సింహారావు, సుకన్య, శిల్పా శ్రీను, సాయి, గోపాలకృష్ణ, వీరస్వామి పాల్గొన్నారు.

గరిడేపల్లి (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమకారులను ఆదుకోవాలని ఆ సంఘం నాయకుడు మండవ నాగేశ్వరరావుగౌడ్ కోరారు. మంగళవారం గరిడేపల్లి మండల కేంద్రంలో ఉద్యమకారుల పాదయాత్రకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యమకారులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సయ్య, వెంకటమ్మ, అంజి, శేఖర్, మధు, రమేష్, వరకుమార్, నాగేందర్ పాల్గొన్నారు.



గరిడేపల్లిలో మాట్లాడుతున్న మండవ నాగేశ్వరరావు

ఎల్ఆర్ఎస్‌కు గ్రీన్‌సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

కల్పించారు. అందుకోసం సూర్యాపేట పరిధిలో విలీనమైన దురాజ్‌పల్లి, టీటీగూడెం, కుడకుడ, గాంధీనగర్, పిల్లలమర్రి, రాయినిగూడెం, కుప్పిరెడ్డిగూడెం, దాసాయిగూడెం, కుసుమవారిగూడెం గ్రామాలు, కోదాడ మునిసిపాలిటీలో విలీనమైన తమ్మర, కొమరబండ గ్రామాల పరిధిలో వెలిసిన అక్రమ వెంచర్లలో స్థలాలు కొనుగోలు చేసిన వాటికి ఎల్ఆర్ఎస్ అవకాశం ఉంది. ఈ అవకాశంతో వేలల్లో ప్లాట్ల యజమానులు దరఖాస్తులు చేసుకున్నారు.

కొనసాగుతున్న ప్రక్రియ

మునిసిపాలిటీ	దరఖాస్తులు
సూర్యాపేట	35,000
కోదాడ	16,500
హుజూర్‌నగర్	4,415
తిరుమలగిరి	6,018
నేరేడుచర్ల	3,157

జిల్లాలోని మొత్తం ఐదు మునిసిపాలిటీల్లో 65,905 దరఖాస్తులు వచ్చాయి. అందులో ఇప్పటివరకు 20,845 దరఖాస్తుదారులకు ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో భాగంగా డబ్బులు చెల్లించాలని సమాచారం ఇచ్చారు. కాగా అందులో సూర్యాపేటలో 14,800 దరఖాస్తులకు 500 మంది, కోదాడలో 4,700 దరఖాస్తుదారులకు 400 మంది, తిరుమలగిరిలో 1,270 దరఖాస్తుదారులకు 135 మంది, నేరేడుచర్లలో 523 దరఖాస్తుదారులకు 50 మంది డబ్బులు చెల్లించి వారి యొక్క ప్లాట్లను క్రమబద్ధీకరించుకున్నారు. హుజూర్‌నగర్‌లో మాత్రం అధికారులు 75 మందికి సమాచారం ఇవ్వగా ఇప్పటివరకు ఎవరూ డబ్బులు చెల్లించలేదు.

ముందస్తుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

ఎల్ఆర్ఎస్ పథకానికి ప్లాట్ల యజమానులు రూ.1000 చెల్లించి ముందస్తుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అందుకోసం స్థల యజమానులు ముందుగా రూ.1000 మునిసిపాలిటీ పేరుతో ఆన్‌లైన్ రూపంలో చెల్లించారు. దీంతో పాటు భూమి యజమాన్య పత్రాలు, లింకు డాక్యుమెంట్లు, ఈసీ కాపీలు, స్థలం యొక్క ఫొటోలను జతచేశారు. వారికి ప్రభుత్వం తాజాగా అవకాశం కల్పించింది. అంతేకాకుండా 2015, 2017లో ఎల్ఆర్ఎస్ కోసం ఆదేశాలు జారీ చేశారు. అప్పుడు ప్లాట్ల యజమానులు రూ.10 వేలు డీడీ చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆ సమయంలో సూర్యాపేటలో 2వేలకు పైగా, కోదాడలో 500 వరకు దరఖాస్తులు చేశారు. వాటిలో కొన్నింటిని పరిష్కరించగా మిగిలిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ దరఖాస్తులకు ప్రస్తుతం అవకాశం ఇవ్వలేదు. దీంతో సంబంధిత ప్లాట్ల యజమానులు చెల్లించిన రూ.10వేలు ప్రభుత్వం వద్దనే ఉండిపోయాయి.

కోట్లలో ఆదాయం

ప్రభుత్వం ప్రకటించిన ఎల్ఆర్ఎస్ ద్వారా జిల్లాలోని మునిసిపాలిటీల నుంచి ప్రభుత్వానికి కోట్లలో ఆదాయం సమకూరుతుంది. ఉదాహరణకు ఒక చదరపు గజం స్థలాన్ని క్రమబద్ధీకరణకు ఒక చదరపు గజానికి ఆ ప్రాంతంలో రిజిస్ట్రేషన్ విలువ ఎంత ఉందో అందులో 14శాతం చెల్లించాల్సి ఉంది. ఈ విధంగా ఒక్కో దరఖాస్తుకు కనీసం రూ.25వేల నుంచి రూ.లక్షల్లో చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా రూ.6.47కోట్ల ఆదాయం సమకూరింది. అందులో సూర్యాపేటలో రూ.3.50కోట్లు, కోదాడలో రూ.2.10 కోట్లు, తిరుమలగిరిలో రూ.5 లక్షలు, నేరేడుచర్లలో రూ.82వేల ఆదాయం వచ్చింది. ఇంకా మిగిలిన దరఖాస్తుల ప్రక్రియ పూర్తి అయితే రూ.కోట్లలో ఆదాయం రానుంది.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

అనుమతులు లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి. లేకుంటే ఆయాచోట్ల ఇంటి నిర్మాణానికి మునిసిపాలిటీ నుంచి అనుమతులు పొందలేరు. ఎల్ఆర్ఎస్ ద్వారా తక్కువ మొత్తంలో ప్లాట్ల క్రమబద్ధీకరణ జరుగుతోంది. ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న యజమానులకు సమాచారం ఇస్తున్నాం.

● శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, సూర్యాపేట

సంక్షిప్త సమాచారం...

ఇంటర్నెట్ లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలి.. సూర్యాపేట టౌన్: సాంకేతిక పరమైన లావాదేవీలు పెరిగిన నేపథ్యంలో ఇంటర్నెట్ బ్యాకింగ్ లావాదేవీలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ నల్లగొండ ఏవో, డీజీఎం వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కిరాణా ఫాన్సీ మర్చంట్ భవనంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అపరిచితులు పంపే లింకులు, యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దన్నారు. అపరిచితులకు బ్యాంకు వివరాలు, ఓటీపీ వివరాలు చెప్పవద్దన్నారు. ఎలాంటి సమాచారం కావాలన్నా సమీపంలోని బ్యాంకులను సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై సైబర్ క్రైం నెం1930కు డయల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ వై.ఉపేంద్రభాస్కర్, కేతిరెడ్డి రంగారెడ్డి, అబ్దుల్లా, ఖాతాదారులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ నాయకుడు గిరిబాబు వర్ధంతి కార్యక్రమం.. హుజూర్‌నగర్: కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకుడు బాచిమంచి గిరిబాబు ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం హుజూర్‌నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు తెలిపారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఉదయం 11గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బూరుగడ్డ దేవాలయంలో ప్రత్యేక పూజలు.. హుజూర్‌నగర్ రూరల్: బహుళ ఏకాదశి సందర్భంగా మండలంలోని బూరుగడ్డ శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్షేత్ర పాలకుడు ఆంజనేయస్వామికి ఆకుపూజ, సహస్రనామ ఫల, పుష్ప అర్చన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, పార్వతి, శివ, జ్యోతి, నాగేందర్, గురవయ్య, హరీష్, కృష్ణ ప్రసాద్, అంజయ్య, నర్సింహారావు, హనుమంతరావు, కవిత, ఈవో లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

సైదులు మృతి పార్టీకి తీరనిలోటు.. కోదాడ రూరల్: కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సింగం సైదులు ఆకస్మిక మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు అన్నారు. మంగళవారం మండలంలోని కాపుగల్లు గ్రామంలో సైదులు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో బాబురావు, మురళి, చలసాని జగన్, నల్లూరి రవి, పంగులూరి రమేష్, వెంకటరమణ చారి, పగిళ్ల రోషయ్య, జిల్లపల్లి శ్రీనివాస్, జిల్లపల్లి వెంకటరత్నం, త్రినాథ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాత.. మునగాల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మంగళవారం మండల కేంద్రంలో కళాజాత ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. . ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఆంజనేయులు, ఎంపీడీవో రమేష్‌దీన్‌దయాల్, ఏపీవో శైలజ, గ్రామ కార్యదర్శి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం.. నూతనకల్: తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియామకమైన మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు తీగల గిరిధర్‌రెడ్డిని మంగళవారం మండలంలోని మిర్యాల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. సన్మానించినవారిలో దరిపెల్లి వీరన్న, అనంతుల శ్రీనివాస్, పసుల అశోక్‌యాదవ్, కాస శంకర్‌యాదవ్, మెంచు లింగమల్లు, ఇరుగు కిరణ్, అనంతుల మధు వేల్పుల కిరణ్ ఇరుగు మల్లేష్, చిర్ర హరీష్ తదితరులు ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి క్వింటా బియ్యం అందజేత.. నూతనకల్: మండలంలోని ఎడవెల్లి గ్రామానికి చెందిన గాజుల లచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుటుంబాన్ని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకుడు గాజుల తిరుమల్‌రావు పరామర్శించి క్వింటా బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బయ్య వీరయ్య, వెంకటేశ్వర్‌రావు, లింగయ్య ఉపేందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం





వినాయకుడి అలంకరణ, పూజల్లో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోదాడ రోడ్డులోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవాలయ 14వ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, గణపతి పూజ, మంత్రపుష్ప నీరాజనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశ్య శ్రీనివాస్‌రెడ్డి, గుండా రమేష్, ఓరుగంటి నాగేశ్వరరావు, తండా సైదారత్న, మాశెట్టి అనంతరాములు, సత్యం, వెంకటనారాయణ, ఎంఎస్ఎన్ రాజు, యర్రంశెట్టి పిచ్చయ్య, ద్రాక్షాయణి, కొమ్ము శ్రీను, ఢీకొండ వెంకటేశ్వర్లు, ఏ.రాంబాబు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



ఏరియా ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

హుజూర్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీనివాసు కోరారు. మంగళవారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రి కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు మంజూరుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగయ్య, శ్రీను, నర్సయ్య, యశోద, ఉష, పద్మ, తులసి, ఉపేంద్ర, సైదమ్మ, భద్రమ్మ, పద్మ పాల్గొన్నారు.

పిచ్చిరెడ్డి ఆశయాలను సాధించాలి



పిచ్చిరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న బెజవాడ వెంకటేశ్వర్లు

నాగారం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ రాష్ట్ర నాయకుడు గుంటకండ్ల పిచ్చిరెడ్డి ఆశయాలను సాధించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కోరారు. పిచ్చిరెడ్డి రెండో వర్ధంతిని మంగళవారం నాగారం బంగ్లాలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. పిచ్చిరెడ్డి కాంస్య విగ్రహనికి వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. నిజాంకు వ్యతిరేకంగా చేసిన సాయుధ పోరాటంలో పిచ్చిరెడ్డి పాల్గొనడంతోపాటు ప్రజలను సంఘటితం చేశారన్నారు. నాగారం తొలి సర్పంచ్‌గా ఎన్నికై 25ఏళ్ల పాటు ప్రజలకు సేవలు అందించారని కొనియాడారు. డిసెంబరు 30న జరిగే సీపీఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లెంల యాదగిరి, కార్యవర్గ సభ్యుడు బూర వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుగులోతు రాజారాం, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు జంపాల మల్లయ్య, తుంగతుర్తి, తిరుమలగిరి మండలాల కార్యదర్శులు పాల్వాయి పున్నయ్య, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోనే కార్యకర్తలకు గుర్తింపు



డీసీసీ అధ్యక్షుడు వెంకన్నయాదవ్‌ను సన్మానిస్తున్న కొమ్ము వెంకన్న

మద్దిరాల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలోనే కార్యకర్తలకు గుర్తింపు లభిస్తుందని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీని నమ్ముకున్న వారిని కాంగ్రెస్ గుర్తిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా వెంకన్నయాదవ్‌ను తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన కొమ్ము వెంకన్న సన్మానించి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లుయాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పచ్చిపాల వెంకన్న, తీకుళ్ల సుధాకర్‌రెడ్డి, కొమ్ము అంజయ్య, మద్దెల బిక్షపతి, నారాయణరెడ్డి, సీతారాములు పాల్గొన్నారు.

అసౌకర్యాలతో వణుకు

(5వ పేజీ తరువాయి)

నిర్మించిన పాలకవీడు కస్తూర్బా పాఠశాల్లో వేడి నీటి సౌకర్యాన్ని కల్పించలేదు. మునగాలలోని ఎస్సీ బాలుర, బాలికల, బీసీ హాస్టళ్లలో మరుగుదొడ్ల సక్రమంగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో 100 మంది విద్యార్థులకు ఐదు బాత్‌రూంలు ఉన్నాయి.

నేలమీదే నిద్ర

కోట్లు వెచ్చించి నిర్మించిన పాలకవీడు మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల భవనంలో బెడ్‌లు లేకపోవడంతో విద్యార్థినులు బండల పైనే నిద్రిస్తున్నారు. అదేవిధంగా కోదాడలో బీసీ హాస్టల్‌లో ఒక్కో మంచానికి ఇద్దరు చొప్పున సర్దుకుంటున్నారు. ఈ ఏడాది దుప్పట్లు ఇవ్వకపోవడంతో పాత దుప్పట్లనే వాడుతున్నారు. తుంగతుర్తి మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్ విద్యార్థులు కనీసం విద్యార్థులకు రగ్గులు అందించలేదు. తిరుమలగిరి బీసీ బాలుర హాస్టల్‌లో కొన్ని ఏళ్లుగా విద్యార్థులు నేలపైనే పడుకుంటున్నారు. చలికాలంలో తట్టుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లుగా కప్పుకోవడానికి దుప్పట్లు రాలేదని ఇంటి వద్ద తెచ్చుకున్న దుప్పట్లనే వాడుతున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కస్తూరి బజార్, తాళ్లగడ్డలో హాస్టళ్లలో విద్యార్థినులు పడుకోవడానికి బెడ్స్ లేవు. చలికాలం కావడంతో దుప్పట్లు, చలికోటు, బెడ్స్ ఇచ్చారు. కొన్ని హాస్టళ్లలో స్టడీ చైర్స్ అందించలేదు.

మెనూ అంతంత మాత్రంగానే

ప్రభుత్వ హాస్టళ్లలో మెనూ సక్రమంగా అమలు చేయడం లేదు.

పారిశుధ్య పనులను టెండర్‌లో దక్కించుకున్న వారు అడపాదడపా వచ్చి మూత్రశాలలు, బాత్‌రూంలను శుభ్రం చేస్తున్నారు. సూర్యాపేట హాస్టళ్లలో డైనింగ్ టేబుళ్లు మరమ్మతులకు వచ్చాయి. దీంతో విద్యార్థులు కింద కూర్చునే భోజనం చేస్తున్నారు. వాటర్ ప్లాంట్ పని చేయడంలేదు. బయటి నుంచి క్యాన్లను తీసుకువచ్చి విద్యార్థులకు తాగునీటిని అందిస్తున్నారు. చివ్వెంల మండలం చందుపట్ల హాస్టల్‌లోనూ మెనూ పాటించడం లేదని విద్యార్థులు తెలిపారు.